




# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు

సోమవారం 11-5-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్


## నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారు: బండి సంజయ్



- నాపై కుట్ర జరుగుతోందంటూ బండి సంజయ్ భావోద్వేగం
- కుమారుడిపై పోక్సో కేసు నమోదు కావడంపై స్పందన
- రాజకీయంగా ఎదుర్కోలేకే దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- సికింద్రాబాద్ సభలో వేదికపై కంటతడి పెట్టుకున్న బండి సంజయ్



# ఈసారి వచ్చేది బీజేపీనే: ప్రధాని

- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో బీజేపీ భారీ బహిరంగ సభ
- తెలంగాణలో భారీ మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్న మోదీ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ రాజకీయాలతో ప్రజలు విసిగిపోయారని వ్యాఖ్యలు
- పశ్చిమ బెంగాల్ చారిత్రక విజయం ఇక్కడ కూడా ఉత్సాహం నింపిందని వెల్లడి



## ఐపీఎస్ భార్య హత్య కేసు.. పనిమనిషి కల్పన కోసం పోలీసుల వేట

- విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం
- పనిమనిషి కల్పనే ప్రధాన నిందితురాలని పోలీసుల నిర్ధారణ

మెయిన్ పేజీలో 3లో

## హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా రన్..



## ఈ నెల 12 బీఆర్ఎస్ సమావేశం.. హాజరుకానున్న కేసీఆర్



హైదరాబాద్: ఈ నెల 12వ తేదీన కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది.

# ఈసారి వచ్చేది బీజేపీనే: ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో తదుపరి ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నాడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని, వారి కుటుంబ రాజకీయాలతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, అందుకే మార్పు కోరుకుంటున్నారని అన్నారు. ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని పశ్చిమ బెంగాల్ ఎన్నికల విజయంతో ప్రారంభించారు. "నిన్న నేను బెంగాల్‌లో ఉన్నాను. అక్కడ తొలిసారి బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశారు. భారీ మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది" అని గుర్తుచేశారు. ఈ చారిత్రక విజయం పట్ల ఉత్సాహం ఇక్కడ తెలంగాణలో కూడా కనిపిస్తోందని, ప్రతి బీజేపీ కార్యకర్తలో నూతనోత్తేజం ఉప్పొంగుతోందని అన్నారు. దేశం నలుమూలలా బీజేపీపై ప్రజల ఆశీస్సులు నిరంతరం పెరుగుతున్నాయని తెలిపారు. బీజేపీ అభివృద్ధి, సుపరిపాలన నమూనాకు ప్రజలు పదేపదే మద్దతు ఇస్తున్నారని చెప్పారు. బెంగాల్‌లో కేవలం రాజకీయ పార్టీలు గెలవడం, ఓడిపోవడం జరగలేదని మోదీ అన్నారు. అక్కడి ప్రజలను ఒకరకంగా బానిసత్వపు సంకెళ్లలో బంధించిన రాజకీయాలను ప్రజలు ఓడించారని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ అవినీతిని పెంచిందని, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించిందని, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కూడా కాంగ్రెస్ నుంచే ఈ



చెడులన్నింటినీ నేర్చుకుందని, వామపక్షాల చెడు అలవాట్లను కూడా అలవర్చుకుందని విమర్శించారు. ఇలాంటి భయంకరమైన రాజకీయ నియంతృత్వ నమూనాను బెంగాల్ ప్రజలు ఓడించారని, అందుకే దేశవ్యాప్తంగా సంబరాలు జరుగుతున్నాయని తెలిపారు. "ఈ దేశ రాజకీయాల్లో వస్తున్న మార్పునకు ఇది సంకేతం. ప్రజలు ఇప్పుడు కుటుంబ పాలన కంటే విశ్వాసాన్ని ఎంచుకుంటున్నారు" అని మోదీ అన్నారు. అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధించిందని, పుదుచ్చేరిలో కూడా బీజేపీ-ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. "ఈ విజయాల తర్వాత తెలంగాణ ప్రజల మనోభావాలను నేను గమనిస్తున్నాను. ఈసారి తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వమే" అని అందరూ అంటున్నారని తెలిపారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా బీజేపీకి కేవలం ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు, ఆ ఇద్దరిలో ఒకరిని అందించిన గడ్డ తెలంగాణ అని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రంలోని ఎంపీలలో దాదాపు సగం మంది బీజేపీ వారేనని తెలిపారు. తెలంగాణ ప్రజలు, రాష్ట్ర బీజేపీ కార్యకర్తలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దేశాన్ని విడదీసే విభజన, ద్వేషపూరిత రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వామపక్ష పార్టీల కంటే వామపక్షంగా... అంటే, పక్కా వక్రీకరించిన మావోయిస్టుగా మారింది. ముస్లిం లీగ్ కంటే కరడుగట్టిన ముస్లిం లీగర్‌గా తయారైంది. అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీని 'ఎంఎంసీ' అని పిలుస్తున్నారు, అంటే ముస్లిం లీగ్ మావోయిస్ట్ కాంగ్రెస్ అని అర్థం" అని వివరించారు.

ఎన్నికలకు ముందు తప్పుడు హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోవడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని ప్రధాని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో కాంగ్రెస్ తన వాగ్దానాలను మరచిపోయిందని, ఇప్పుడు తెలంగాణలో కూడా అదే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. దేశంలో మావోయిస్టు ఉగ్రవాదం చివరి శ్వాస తీసుకుంటున్నప్పటికీ, మావోయిస్టులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. అభివృద్ధి చెందిన భారత్‌తో సమానంగా తెలంగాణ, హైదరాబాద్ కూడా పురోగమించేలా చూడటమే తమ ప్రయత్నమని, అందుకోసం వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసే అవకాశం లభించిందని తెలిపారు. ఈ సభలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీ కె. లక్ష్మణ్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ వేదికపై డప్పు కొట్టి ఉత్సాహ పరిచారు.

# నన్ను రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారు: బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సభా వేదికపై తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తనపై కొందరు కుట్రలు పన్నుతున్నారని, రాజకీయంగా ఎదుర్కోలేకే తన కుటుంబంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే, బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. 17 ఏళ్ల బాలికను వేధించారంటూ ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన బండి సంజయ్.. ఈ విషయంపై స్పందిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రధాని మోదీ సభకు ముందు తన ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఈ 'పొలిటికల్ హిట్ జాబ్' జరిగిందని అన్నారు. ఒక బీసీ నాయకుడిగా తాను ఎదగడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా రన్..

**జెండా ఊపి ప్రారంభించిన భువనేశ్వరి**

**తలసేమియాపై అవగాహన కోసం హైదరాబాద్‌లో భారీ రన్**

**జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ భువనేశ్వరి**

**దేశంలో ఏటా 12 వేల మంది చిన్నారులు తలసేమియాతో జన్మిస్తున్నారన్న భువనేశ్వరి**

**రక్తదానంపై అపోహలు వీడి ముందుకు రావాలని పిలుపు**

తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆదివారం హైదరాబాద్‌లో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నగరంలోని నెక్లెస్ రోడ్డులో 'తలసేమియా రన్'ను ఘనంగా నిర్వహించింది. జలవిహార్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో 3కి, 5కి, 10కి విభాగాల్లో యువత, నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ తలసేమియా వ్యాధి తీవ్రతను వివరించారు. "దేశంలో ఏటా 12 వేల మంది చిన్నారులు తలసేమియాతో జన్మిస్తున్నారు. ఈ వ్యాధి కారణంగా ఎందరో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. బాధితులను కాపాడేందుకు రక్తమార్పిడి ఒక్కటే మార్గం. రక్తదానంపై అపోహలు వీడి ముందుకు రావాలి. యువత తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలను కాపాడవచ్చు" అని ఆమె పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమానికి భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తం, మందులు అందిస్తోందని భువనేశ్వరి గుర్తుచేశారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కొత్తగా తలసేమియా కేంద్రాలు, బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె ప్రకటించారు. సామాజిక బాధ్యతగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నగర పౌరులు పాల్గొన్నారు.



# ఈ నెల 12 బీఆర్ఎస్ సమావేశం.. హాజరుకానున్న కేసీఆర్

ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం, బలోపేతంపై అంతర్గతంగా చర్చించనున్నట్లు పేర్కొంది. త్వరలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికలు సైతం జరిగే అవకాశం ఉండడంతో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి చేరిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో కేసీఆర్ ప్రసంగం సూపర్ హిట్ అయ్యింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు జోరుమీదున్నాయి. ఈ నేపథ్యంలోనే గులాబీ బాస్ మరోసారి నాయకులకు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది.

## స్నేహానికి నిలువెత్తు నిదర్శనం..!

**కరుణకుమార్ కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించిన ఇంటర్ స్నేహితులు..**



**క్రైమ్ మిర్రర్(రంగారెడ్డి ప్రతినిధి):** మాడ్గుల మండలం కొత్తబ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఇటీవలి కాలంలో గుండెపోటుతో మరణించిన జమిటిక కరుణకుమార్ కుటుంబానికి (2006-2008) ఇంటర్మీడియట్ బ్యాచ్ స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన కుమారుడు, కుమార్తె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, కరుణకుమార్‌తో కలిసి సీబీఏం కాలేజీలో చదివిన (2006-2008) ఇంటర్మీడియట్ బ్యాచ్ స్నేహితులు కలిసి రూ. 1,50,000 లక్షా యాభై వేల రూపాయలను వారి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ స్నేహానికి విలువ డబ్బుతో కొలవలేం. కష్టసమయంలో అండగా నిలబడటమే నిజమైన మానవత్వం అని తెలిపారు. వారి సహాయం కుటుంబ సభ్యులకు ఆర్థికంగా తోడ్పాటు అందించడమే కాకుండా, మానసిక ధైర్యాన్ని కూడా ఇచ్చిందని గ్రామస్తులు అభినందించారు.

## వార్త రిపోర్టర్ జహంగీర్ గౌడ్ ని పరామర్శించిన టీ జే ఏ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్



**ఆత్మకూరు(ఎం)మే 10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం)మండలం ఆదివారం రోజు మండల కేంద్రానికి చెందిన వార్త రిపోర్టర్ పొన్నాగాని జహంగీర్ గౌడ్ తల్లి చంద్రకళ ఇటీవల స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా రిపోర్టర్ పోన్నగాని జహంగీర్ గౌడ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గుర్రం మల్లేష్ , టీ జే ఏ జిల్లా సహాయ కార్యదర్శి నోముల రవీందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు .

## వెల్మజాల గ్రామంలో మదర్స్ డే



**ఆత్మకూరు(ఎం),మే010/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామం ఆదివారం రోజు మదర్స్ డే సందర్భంగా గ్రామంలో "సెయింట్ పాల్ బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి"లో మదర్స్ డే నిర్వహించుట జరిగింది. వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను, జంగ లలిత పాస్టర్ అమ్మని గ్రామంలోని మహిళలు శాలువతో సన్మానించడం జరిగింది. గ్రామంలో చర్చి ఆధ్వర్యంలో మంచినీటి బోర్లు ,దోమల తెరలు, వితంతువులకు దుప్పట్లు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించుట,ఇలా ఎన్నో సామాజిక కార్యక్రమాలను చేసినందున, గ్రామంలో అందరి మన్ననలు పొందినందున, మహిళలు శాలువతో సన్మానించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ జయమ్మ, కె సంతోష ,కె మంజుల, కె సుశీల, కె పద్మ ,యాదమ్మ,పి లక్ష్మి,బి దేవమ్మ,శాంతమ్మ,కె ఐలమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## మాట తప్పని మల్లారెడ్డి సొంత నిధులతో పుల్లాయిగూడెంలో కల్వర్టు నిర్మాణం



**ఆత్మకూరు(ఎం),మే10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పుల్లాయిగూడెం గ్రామం రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు చేస్తారు కానీ గెలుపోటములతో సంబంధం లేకుండా, ఇచ్చిన మాట కోసం సొంత సొమ్మును వెచ్చించే నాయకులు అరుదుగా ఉంటారు. ఆ అరుదైన కోవకే చెందుతారు బీజేపీ జిల్లా కార్యదర్శి తడిసిన మల్లారెడ్డి. పుల్లాయిగూడెం గ్రామంలోని మొర్సుబావి ప్రాంతంలో నివసించే 7 కుటుంబాల పరిస్థితి వర్షాకాలంలో వర్ణనాతీతంగా ఉండేది. చిన్నపాటి వర్షం పడినా వాగు ఉధృతికి ఊరితో సంబంధాలు తెగిపోయి, ఆ కుటుంబాలు అల్లాడిపోయేవి. గత సర్పంచ్ ఎన్నికల సమయంలో ఈ విషయాన్ని మల్లారెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. ఆనాడే ఆయన వారికి హామీ ఇచ్చారు. "మీ కష్టాన్ని తీర్చే బాధ్యత నాది" అని వారు ప్రభుత్వ నిధుల కోసం ఆశించకుండా, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామస్తులు మళ్లీ ఇబ్బంది పడకూడదని మల్లారెడ్డి గట్టి సంకల్పం తీసుకున్నారు. సుమారు లక్ష రూపాయల తన సొంత నిధులను వెచ్చించి, యుద్ధ ప్రాతిపదికన మొర్సు బావి వద్ద కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఆదివారం రోజు ఆ కల్వర్టు పనులు పూర్తి కావడంతో గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తడిసిన మల్లారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ "పుట్టిన ఊరి రుణం తీర్చుకోవడం కంటే మించిన పదవి మరొకటి లేదు. పదవి ఉన్నా లేకున్నా నా పుల్లాయిగూడెం ప్రజలకు అండగా ఉండటమే నా లక్ష్యం. ఆ 7 కుటుంబాల ఇబ్బందులను చూసి, ఇచ్చిన మాట ప్రకారం నా సొంత నిధులతో ఈ పని పూర్తి చేశాను. ఇకపై వర్షాకాలంలో వారికి ఎలాంటి ఆందోళన అవసరం లేదు," అని ధీమా వ్యక్తం చేశారు. తమ సమస్యను సొంత సమస్యగా భావించి, లక్ష రూపాయలు ఖర్చు చేసి కల్వర్టు నిర్మించిన మల్లారెడ్డికి పుల్లాయిగూడెం గ్రామ ప్రజలు, ముఖ్యంగా మొర్సు బావి సమీప నివాసితులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మెగా జాబ్ మేళాలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




**ఆత్మకూరు(ఎం),మే010/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని న్యూ డైమేనేషన్ స్కూల్‌లో కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో, 1 మిలియన్ 1 బిలియన్ సంస్థ సహకారంతో నిర్వహించిన మెగా జాబ్ మేళా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కుంభం ఫౌండేషన్ కుంభం కీర్తి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నిరుద్యోగ యువతను ఉద్దేశించి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం యువత ఉపాధి అవకాశాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇలాంటి జాబ్ మేళాలు నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. అలాగే విద్యార్థులు కేవలం విద్యతో సరిపెట్టుకోకుండా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. యువత తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు చేరువ చేయడమే ఈ జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉపాధి కార్యక్రమాలు నిర్వహించి యువతకు అండగా నిలుస్తామని చెప్పారు. యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ మెగా జాబ్ మేళాలో వందలాది మంది నిరుద్యోగ యువత పాల్గొని వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## శారాజీపేటలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి చేరిన స్నేహితులు**



**ఆత్మకూరు(ఎం),మే10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలో గత కాలపు తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, చదువుకున్న బడిని, నేర్పిన గురువులను గౌరవించుకుంటూ శారాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జిపఉపా)ఆవరణలో 2005-2006 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రోజు తేదీ:10-05-2026నాడు అత్యంత వైభవంగా జరిగింది. "మళ్ళీ బడికి పోదాం - 2026" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యాకుసుమాల కలయికతో సందడిగా మారింది. గురుపూజోత్సవం:ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా అప్పటి ఉపాధ్యాయులు పోరెడ్డి రంగయ్య, ఉమాదేవి, ప్రభాకర్ రెడ్డి, కిష్టయ్య, నాగేందర్, జంగయ్య, మరియు సంధ్య రాణి గారు విచ్చేశారు. విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత కూడా విద్యార్థులందరూ ఐక్యంగా ఒకే చోట చేరడం, పాఠశాల పట్ల గౌరవం కలిగి ఉండటం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. జ్ఞాపకాల పందిరి:దసుమారు రెండు దశాబ్దాల క్రితం పాఠశాల విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు, నేడు వివిధ రంగాల్లో స్థిరపడి, మళ్ళీ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. పాత జ్ఞాపకాలను పంచుకుంటూ, ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 2005-2006 బ్యాచ్‌కు చెందిన అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల్,మే 10,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చౌటుప్పల్ క్లాత్ అండ్ రెడిమేడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా షాపింగ్ కాంప్లెక్స్ లో మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి ఆనందోత్సవంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కర్నాటి శ్యాం ప్రసాద్, కార్యదర్శి సుంకి గణేష్, మసరం యాదగిరి, పున్నా రామకృష్ణ, గోషిక కరుణాకర్,గంజి రవి, తడక నరసింహా, లోకా విష్ణు, లక్ష్మయ్య, గోశిక పాండు, మహిళలు కర్నాటి పిచ్చమ్మ, కోడి వనిత, కర్నాటి మౌనిక, గోశిక శాంతి, జిల్లా లావణ్య,గోశిక సుమతి, పులిపాటి జయమ్మ, మసరం శారద, సుజన, పద్మ,మమత, కలమ్మ, లోక పుష్పలత, సుంకి ఉమా, వసంత, లలిత,చంద్రకళ,శమంతకమణి పాల్గొన్నారు.

## జాతీయ వైస్ ప్రెసిడెంట్ గా కందగట్ల సురేందర్ రెడ్డి నియామకం



**చౌటుప్పల్. మే 10, క్రైమ్ మిర్రర్:** యెల్లగిరి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, అడ్వకేట్, ఉప సర్పంచ్ సురేందర్ రెడ్డి కందకట్లని "నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటి కరప్షన్ అండ్ యాంటి క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా " సంస్థ జాతీయ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించింది. సామాజిక సేవ, మానవ హక్కుల పరిరక్షణ, అవినీతి వ్యతిరేక పోరాటం, ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో ఆయన చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు సంస్థ జాతీయ అధ్యక్షులు డా. కె.ఎస్. జోతిశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కందగట్ల సురేందర్ రెడ్డి మాట్లాడుతూ... తనపై ఉంచిన నమ్మకానికి సంస్థకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజల హక్కుల పరిరక్షణ, సమాజ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ నియామకంపై గ్రామ ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాలుగు తరాల మాతృమూర్తులతో ఘనంగా మాతృదినోత్సవ వేడుకలు



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 10:** అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ తన నివాసంలో వినూత్నంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగు తరాలకు చెందిన మాతృమూర్తులు ఒకే వేదికపై చేరి మాతృత్వపు మధుర క్షణాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ తన మేనకోడలు శివాశ్రిత చేతుల మీదుగా కేక్ కట్ చేయించి మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ సమాజంలో అమ్మ స్థానం వెలకట్టలేనిదని అన్నారు. నాలుగు తరాల తల్లుల సమక్షంలో మాతృదినోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఒక బిడ్డ ఎదుగుదలలో, కుటుంబ ఐక్యతలో తల్లి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవితంలో పాత తరం అనుభవాలు, కొత్త తరం ఆలోచనలు కలవాల్సిన అవసరం ఉందని, అమ్మల గొప్పతనాన్ని చాటిచెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ఈ వేడుకలు కుటుంబ బంధాలను మరింత బలపరిచేలా నిర్వహించబడినట్లు పాల్గొన్న వారు తెలిపారు.

# విష్ణువర్ధన్ రెడ్డి స్మారక జాతీయ కరాటే పోటీలకు పటాన్‌చెరు వేదిక

- ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా ఘనంగా శ్రీకారం
- ఆరోగ్యానికి ఆనవాలు భవిష్యత్తుకు ఆధారం క్రీడలే
- విద్యార్థి దశ నుంచే క్రీడలపై దృష్టి 2000 మంది క్రీడాకారులతో క్రీడా జాతర
- కృతజ్ఞతలు తెలిపిన క్రీడాకారులు, తల్లిదండ్రులు
- క్రీడాకారుల అభివృద్ధికి అండగా నిలుస్తాం ఎమ్మెల్యే స్పష్టం
- గ్రామీణ ప్రతిభకు వేదికగా మినీ స్టేడియాల ఏర్పాటు
- క్రీడల ప్రోత్సాహానికి రూ.5 లక్షల సొంత నిధులు
- క్రీడాస్ఫూర్తికి నమస్కారం ఎమ్మెల్యేకు





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 10:** పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడా వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భారత రత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా పోటీలను ప్రారంభించారు. లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2000 మంది క్రీడాకారులు హాజరుకావడం విశేషం. ఎమ్మెల్యే జీఎంఆర్ ఆధ్వర్యంలో పోటీల కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేయడం క్రీడాకారులు, వారి తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం కోసం క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని సూచించారు. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని, పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతో పాటు ఏడాది పొడవునా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారుల కోసం మూడు మినీ స్టేడియాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం పై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలని, సమాజం మొత్తం కలిసి వాటిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన సహాయం కోసం ఎప్పుడైనా తనను సంప్రదించాలని తెలిపారు. ఈ కరాటే ఛాంపియన్‌షిప్ నిర్వహణ కోసం ఎమ్మెల్యే జీఎంఆర్ తన సొంత నిధుల నుంచి రూ.5 లక్షలు అందజేయడం విశేషం. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు క్రీడాకారులు, తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎండీఆర్ ఫౌండేషన్ అధ్వర్యం ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు

- ఎండిఆర్ అధినేత పృథ్వీరాజ్ తల్లి తులసి లక్ష్మి చేతుల మీదుగా బాలింతలకు కిట్ల అందజేత
- మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరిపిన ఎండిఆర్ సంస్థ
- ఎండిఆర్ ఫౌండేషన్ సేవలను అభినందించిన మహిళలు
- ఆరోగ్యం, విద్య, సాధికారత రంగాల్లో సేవలు
- నాలుగేళ్లుగా నిరంతర సేవా కార్యక్రమాలు, తల్లుల పాత్రపై ప్రేరణాత్మక సందేశం




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 10:** పటాన్‌చెరు పట్టణంలోని ఎండిఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో ప్రపంచ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలుగా మాతృత్వపు కొత్త ప్రయాణాన్ని ప్రారంభించిన తల్లులు మరియు వారి శిశువులకు బేబీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్, ఆయన తల్లి శ్రీమతి మాద్రి తులసి లక్ష్మి పాల్గొని బాలింతలకు బేబీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ "అమ్మ ప్రేమకు ప్రత్యామ్నాయం లేదని, తల్లులు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజ నిర్మాణానికి మూలస్తంభాలని తెలిపారు. ప్రతి తల్లి ఆరోగ్యంగా, గౌరవంగా జీవించే సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం ఎండిఆర్ ఫౌండేషన్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. మాతృదినోత్సవం సందర్భంగా అన్ని తల్లులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీమతి మాద్రి తులసి లక్ష్మి మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మాతృదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఎండిఆర్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, మహిళా సాధికారత, బాలల సంక్షేమ రంగాల్లో ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రజల విశ్వాసాన్ని పొందాయని పేర్కొన్నారు. అవసరమైన వర్గాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమని తెలిపారు.ఇగత నాలుగు సంవత్సరాలుగా మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు, బాలింతల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపారు.

# దళితుల ఆత్మీయ బంధువు సీఎం రేవంత్ రెడ్డి:పున్న కైలాష్



**క్రైమ్ మిర్రర్, నల్లగొండ బ్యూరో:** దళితుల ఆత్మీయ బంధువు సీఎం రేవంత్ రెడ్డి అని నల్లగొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అన్నారు. ఆదివారం నాడు నల్లగొండ పట్టణంలోని యాదవ సంఘ భవనంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణకై సమీక్ష సమావేశం నిర్వహించారు. డిసిసి ప్రెసిడెంట్ కైలాష్ నేత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా నాజ సెల్ సంస్థాగత నిర్మాణ ఇంచార్జీ మందుల సూర్యకిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పున్న కైలాష్ నేత మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో 5 పదవులు దళితులకు దక్కాయని, నాజ వర్గీకరణతో అణగారిన వర్గాలకు న్యాయం చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి దక్కిందని అన్నారు. దళితుల ఆత్మీయ బంధువుగా సీఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారని కొనియాడారు. దళితులను వంచించిన కేసీఆర్ ను బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మబోరని, 2029లో తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మందుల సూర్య కుమార్ మాట్లాడుతూ.. సంస్థాగతంగా దళిత విభాగం బలంగా ఉందని కాంగ్రెస్ కు అండగా నిలిచేది దళితులేనని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తో సాధ్యమని అన్నారు. త్వరలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా మండల గ్రామ స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆశవహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాజ సెల్ జిల్లా అధ్యక్షులు బోడ స్వామి, బీసీ సేల్ చైర్మన్ జిల్లా పల్లి పరమేష్,కుర్వటి గణేష్,పెరిక అంజయ్య, పుల్లెంల సందీప్, సంజయ్,వినోద్, చిరుమర్తి ఉపేందర్, పెరిక హరిప్రసాద్, పగిళ్ల రాజు, చర్లపల్లి గౌతమ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం ఎమ్మెల్యే కుంభం



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శాసనసభ్యులు కుంభం నివాసంలో రైస్ మిల్లర్లు మరియు రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు, రవాణా,మిల్లింగ్ తదితర అంశాలపై రైతులు మరియు మిల్లర్ల అభిప్రాయాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా, అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని,తూకం, చెల్లింపులు, రవాణా తదితర విషయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు.అన్నదాతల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో దశరథ, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశంసత్తిరెడ్డి, వలిగొండ మండల, గ్రామాల సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు,రైస్ మిల్లర్ల యజమానులు, రైతులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన రాష్ట్ర మహిళా కార్పోరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి భాస్కర్



**ఆత్మకూరు(ఎం),మే10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని దొంతిరి సోమిరెడ్డి గార్డెన్స్ లో జరిగిన కోక్కలకొండ అరుణ – కీ॥శే॥ శ్రీశైలం కుమారుడు సాయి కుమార్ – వైష్ణవిల వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వధించిన రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్పర్సన్ బండ్రు శోభారాణి భాస్కర్. వీరివెంటా కాంగ్రెసు నాయకులు పాల్గొన్నారు.

## అలరించినా వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు



**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం రాజశ్యామల డాన్స్ అకాడమీ నాట్య గురువులు శ్రీ లీల కృష్ణ రెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన లో వినాయక కౌతం, శ్రీ విఘ్న రాజాం భజే, దుర్గ తరంగం, అయిగిరినందిని, వన్దే వసుదేవం, బాలకనకమయ, అన్నమాచార్య కీర్తనలు, శ్రీనివాస కళ్యాణం, ప్రహ్లాద పట్టాభిషేకం మొదలైన అంశాలనుం హారిక, హర్షిత, జ్యోస్నా, రితిక, సాహితి, హర్షిత,ముక్త, శరణ్య, చైత్ర సాయి పూజిత, సౌజన్య , ఈక్షిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు.....





**చందానగర్ క్రైమ్ మిర్రర్ :** హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం పురస్కరించుకొని పలువురు మహిళ మాతృ మూర్తులకు ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా మహిళ మూర్తులకు శాలువాతో సన్మానించి స్వీట్ ప్యాకెట్లను అందచేశారు. మాతృ దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులను సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సంస్కారాల సందడిలో మదర్స్ డే

**మాధాపూర్‌లో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు**



**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** మాధాపూర్‌లోని స్మార్ట్ పర్ప్ ప్రీ స్కూల్‌లో ఆదివారం మదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమ్మర్ క్యాంప్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు నృత్యాలు, పాటలు, వినోదాత్మక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా నిర్వహించిన పాదపూజ కార్యక్రమం తల్లిదండ్రులను భావోద్వేగానికి గురిచేసింది. పిల్లలు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు తీసుకోవడం అందరినీ కట్టిపడేసింది. భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు పిల్లలకు నేర్పించే ప్రయత్నం అభినందనీయమని తల్లిదండ్రులు ప్రశంసించారు. పల్లేరుమూడి సత్యవతి, పల్లేరుమూడి వరలక్ష్మి, అరుణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రైమ్ మిర్రర్ వార్తకు స్పందన

**ప్రమాదకర మ్యాన్‌హోల్ పై స్పందించిన అధికారులు సమస్యకు ముగింపు**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 10:** అమీన్పూర్ జీహెచ్ఎంసీ పరిధిలోని తులసివనం కాలనీ రోడ్డుపై తెరిచి ఉన్న ప్రమాదకర మ్యాన్‌హోల్ సమస్యపై క్రైమ్ మిర్రర్‌లో గురువారం ప్రచురించిన “తులిసి వనం రోడ్డులో ప్రమాదకర మ్యాన్ హోల్“ అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించిన అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించారు. నడిరోడ్డులో తెరిచి ఉన్న మ్యాన్‌హోల్ కారణంగా వాహనదారులు, పాదచారులు, ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గుర్తించిన అధికారులు తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని మ్యాన్‌హోల్‌ను మరమ్మత్తు చేసి సురక్షితంగా మూసివేశారు. ఇప్పటివరకు తాత్కాలిక హెచ్చరికలతోనే కొనసాగిన పరిస్థితికి ముగింపు పలికిన ఈ చర్యపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించిన అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడ ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.








## జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి : డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :**బడంగ్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అన్ని సూపర్వైజర్లు విధిగా హాజరయ్యారు. జనగణన నిర్వహణకు సంబంధించిన ఎన్యుమరేటర్ల తుది జాబితా సిద్ధం చేయడం జరిగింది. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్యాలయానికి హాజరైన సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్లకు ఆర్డర్ కాపీలు, హెచ్‌ఎల్బి మ్యాప్స్ మరియు ఐడీ కార్డులు పంపిణీ చేయబడినాయి. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ, రేపటి నుండి జనగణన ఫీల్డ్ విధులు ప్రారంభించి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెన్సస్ స్టాటిస్టికల్ ఆఫీసర్ సాహిల్, విజయ్, శివాతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


## పలు కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆత్మకూరు(ఎం),మే10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం ఆదివారం రోజు మండల కేంద్రంలోని వార్త రిపోర్టర్ పొన్నగాని జహంగీర్ గౌడ్ మాతృమూర్తి పొన్నగాని చంద్రకళ మరణించినందున వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియచేసినారు. అనంతరం మండల పరిధిలోని మొరిపిరాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిరెడ్డి శంకర్ రెడ్డి, నారాయణ రెడ్డి మాతృమూర్తి వీరమ్మ కొద్దీ రోజుల క్రితం మృతిచెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వీరితోపాటు మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దయ్య గౌడ్, పట్టణ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సర్వపల్లి గ్రామ సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి,మోదుగుకుంట సర్పంచ్ సోలిపురం ఏల్లారెడ్డి, డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్,కందడి అనంత రెడ్డి, నాగం లక్ష్మారెడ్డి,కట్టేకోల హనుమంత్ గౌడ్,తండ శ్రీశైలం గౌడ్, దొంతరబోయిన భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



# తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి
- రైస్ మిల్లర్లు ధాన్యం స్వీకరణలో సహకరించాలి
- కొనుగోళ్ల వేగం పెంచేందుకు హమాలీల సంఖ్యను పెంచాలి
- నాణ్యతపై సందేహాలుంటే ముందుగా డీఎస్‌వోకు సమాచారం ఇవ్వాలి




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసుకునే సమయంలో తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు రైస్ మిల్లర్లు మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సమీక్షించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తాలు పేరుతో రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించరాదని స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిర్దిష్ట కారణాలు లేకుండా తిరస్కరించ వద్దని సూచించారు. ఏదైనా ధాన్యం ఎఫ్.ఏ.క్యూ. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేదని భావించిన పక్షంలో వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారికి (డీఎస్‌వో) సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమాచారం అందిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన సాంకేతిక సహాయ కమిటీని రైస్ మిల్లులకు పంపించి ధాన్యం నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు. సాంకేతిక కమిటీ నివేదికలో నాణ్యత ప్రమాణాలు లేవని నిర్ధారణ అయిన పక్షంలో మాత్రమే ధాన్యాన్ని తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు అందరూ ధాన్యం స్వీకరణలో సహకరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కావాలంటే హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు పడకుండా ప్రతి రైస్ మిల్లర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్ రావు మిల్లర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉరి వేసుకోని విద్యార్థి ఆత్మహత్య

**గండిపేట(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉరి వేసుకోని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఎసై ్ర పైడినాయుడు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన శివాజీ మోర్ కుమారుడు ప్రేమ్‌శివాజీమోర్(18). ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మార్కులు తక్కువ వచ్చాయి. కొన్ని రోజుల క్రితం లక్ష్మీగూడలో ఉండే



మామ ఇంటికి వచ్చి ఉంటున్నాడు. అలాగే తల్లిదండ్రులతో ప్రేమ్‌కు కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకోని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చరీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భరతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సికింద్రబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారీ బహిరంగ సభకు మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్‌ల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో తోకల శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ చారిత్రాత్మకంగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వచ్చారన్నారు. సభకు దుర్గానగర్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీతో అదే విధంగా 25 బస్సులు, 100 కార్లు, సుమారు రెండు



వేల జన సమీకరణతో సభకు తరలివెళ్లారన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలతో సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు, మహిళలు, సీనియర్ నాయకులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ నుంచి మోడీ సభకు తరలిన బీజేపీ నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారీ బహిరంగ సభకు రాజేంద్రనగర్ నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. భారీగా బస్సుల ర్యాలీలను ప్రారంభించి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ, గోషామహల్ ఇన్‌చార్జ్ శ్రీధర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు జి.బాబురావు, డివిజన్ ఉపాధ్యక్షులు పవన్‌రాజ్, డివిజన్ కార్యాదర్శి కవిత, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి గుడిసెయాదయ్య, జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు పి.రవీందర్, ప్రధాన కార్యదర్శి ఈ.వేణుగోపాల్, నాయకులు జ్ఞానేశ్వర్, కిరణ్, రమణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# మృత్యువులోను అవయవాలను దానం చేసిన వరలక్ష్మి



**కూకట్ పల్లి, మే 10 (క్రైమ్ మిర్రర్) :** బిడ్డలకు జన్మనిచ్చే అమ్మ మరణం లోను తన అవయవాలను దానం చేసి మరి కొంత మందికి పునర్జన్మను ప్రసాదించింది. అది మాతృ దినోత్సవం నాడు జరగడం మరో అద్భుతం. తెలంగాణ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి రాఘవేంద్ర కూకట్ పల్లి నివాసి. తన మాతృమూర్తి వరలక్ష్మి గత రెండు రోజుల క్రితం అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడ్డారు. కుటుంబ సభ్యులు ఆమెను యశోద ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పలు చికిత్సలు నిర్వహించి బ్రెయిన్డెడ్ అయినట్లు నిర్ధారించారు. చికిత్సలు నిర్వహించినా ఫలితం ఉండదని వైద్యులు కుటుంబ సభ్యులకు వివరించారు. చివరిక్షణాల్లో వరలక్ష్మి అవయవాలను ఇతరులకు దానం చేస్తే మంచిదని సూచించారు. ఇదే విషయమై కుటుంబ సభ్యులందరూ చర్చించుకుని వరలక్ష్మి అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం మాతృ దినోత్సవం నాడు ఉదయం వైద్యులు ఆమె అవయవాలను సేకరించారు. అనంతరం యశోద ఆసుపత్రి సిబ్బంది ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి మార్చ్ డ్రిల్ చేస్తూ ఘనంగా నివాళులర్పించారు.

**మృతురాలు వరలక్ష్మి అవయవాల దానంపై అవోపా ప్రశంసలు**

మృత్యువుతో పోరాడుతున్న వరలక్ష్మి తన అవయవాలను ఇతరులకు దానం చేసి మరణించడం పట్ల అవోపా నేతలు ప్రశంసలు కురిపించారు. కోట్లాది రూపాయల సంపాదన కాదు పోయేటప్పుడు తాను చేసే మంచి మాత్రమే చిరకాలం గుర్తుండేలా వరలక్ష్మి తన అవయవాలను దానం చేసి మరోసారి నిరూపించినట్లు అవోపా నేతలు కొనియాడారు. వరలక్ష్మి భౌతికంగా లేకపోయినా తన అవయవాలు జీవించి ఉంటాయన్నారు. అవోపా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి రాఘవేంద్ర కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందించారు. మృతురాలు నివాసానికి అవోపా నేతలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, స్థానికులు పెద్ద ఎత్తున చేరుకొని వరలక్ష్మి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అంత్యక్రియలో పాల్గొన్నారు.

# ప్రజల్లోనే నాయకత్వానికి అసలైన గుర్తింపు

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్**

**కూకట్ పల్లి, మే 10 (క్రైమ్ మిర్రర్) :** నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ, సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడికే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదే రోజు డివిజన్ అధ్యక్షుడు రమేష్ జన్మదినోత్సవం కావడంతో బండి రమేష్ ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, సేవాభావం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి రమేష్, దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించేలా భారత రాజ్యాంగాన్ని రచించిన భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచిన అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఇటీవల దళితరత్న అవార్డులు అందుకున్న



ప్రముఖులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి బలమని అన్నారు. సుదీర్ఘకాలంగా పార్టీని అంటిపెట్టుకుని ప్రజాసేవలో ముందుండే బేగంపేట డివిజన్ అధ్యక్షుడు రమేష్ సేవలు అభినందనీయమని బండి రమేష్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత చేరువగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, కరుణాకర్, సురేష్, పర్వేజ్, అలీ భాయ్, భరత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో నేటి నుండి విద్యా వారోత్సవాలు

**కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి వెల్లడి**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నేలకొండపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేటి నుండి వారం రోజుల పాటు విద్యా వారోత్సవాలు ఘనంగా జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి వెల్లడించారు. ఆదివారం స్థానిక కళాశాలలో అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విద్యా వారోత్సవాల ప్రణాళికలో భాగంగా మొదటి రోజు కరపత్రాల విడుదలతో 7 రోజుల విద్యా వారోత్సవాల కార్యాచరణ ప్రణాళిక ఘనంగా ప్రారంభమవుతుందన్నారు. రెండో రోజు యోగా ధ్యాన తరగతుల ఏర్పాటు మూడో రోజు స్థానిక సర్పంచులకు అవగాహన కార్యక్రమం కళాశాలలో సాధించిన ప్రగతి విజయాల ప్రదర్శన ఉంటుందన్నారు. నాల్గవ రోజు తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం ఐదవ రోజు మన గ్రంథాలయ జ్ఞానోత్సవం ఆరవ రోజు డిజిటల్ లెర్నింగ్ కృత్రిమ మేధ వర్ధమాన సాంకేతికతలపై సెమినార్ నిర్వహించబడుతుందన్నారు. చివరి రోజున ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం విద్యా వారోత్సవాల నివేదిక విడుదల ముగింపు సమావేశం ఉంటుందన్నారు. ఈ విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం ఆధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



# మంత్రి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరణ



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నేలకొండపల్లి మండలం లోని మోటాపురం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో జరిగే మహోత్సవాలకు రావాలని కమిటి సభ్యులు ఆదివారం మంత్రి శ్రీనివాసరెడ్డి ని కలిసి ఉత్సవాలకు రావాలని కోరారు అనంతరం మహోత్సవాల కరపత్రం ను ఆవిష్కరించారు దేవాలయం 12 వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 13, 14, 15 తేదిలలో జరగనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని పంచాయతీ సర్పంచ్ ఏలూరి రామారావు కోరారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటి ప్రతినిధులు ఇంటూరి అశోక్ చావా కిరణ్ హనుమంతరావు రావెళ్ల కృష్ణారావు భాగం మురళీ చావా రవి చావా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియాతో పోరాడుతున్న పిల్లలకు 41వ సారి రక్తదానం చేసిన నరేందర్‌బాబు



**గండిపేట(క్రైం మిర్రర్):** తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌బాబు పాల్గొని 41వ సారి తలసేమియాతో పోరాడుతున్న పిల్లల కోసం రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా టీఎస్‌సిఎస్ యాజమాన్యం ఆయన సేవలను గుర్తించి మెమొంటో, సర్టిఫికెట్ అందించి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రక్తదాతలు చందు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పనికి వెళ్తున్నానని చెప్పి వ్యక్తి అదృశ్యం



**గండిపేట(క్రైం మిర్రర్):** ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రైడినాయుడు తెలిపిన వివరాల ప్రకారం శాస్త్రీపురం నూర్ కాలనీకి చెందిన మహ్మద్ జహంగీర్(40), ముంతాజ్‌బేగం భార్యభర్తలు. జహంగీర్ వెల్డింగ్ పనులు నిర్వహిస్తుంటాడు. ఈ నెల 8వ తేదీన ఉదయం 7 గంటల సమయంలో పనికి వెళ్తున్నానని భార్యకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఆయన ఫోన్‌కు కాల్ చేసింది. స్విచ్ ఆఫ్ అని రావడంతో ఆందోళనకు గురై చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎన్జీఆర్ నెల నెలా వైద్య శిబిరం విజయవంతం

- 126 మంది రోగులకు వైద్య సేవలు
- ప్రజలకు అందుబాటులో అధునాతన వైద్య సేవలు
- ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో జరిగిన 41వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 126మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో షుగర్ బీపీ జీర్ణకోశ సమస్యలకు నేత్ర వైద్య చికిత్సలతో పాటు ఇతర సాధారణ జబ్బులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ వ్యాధులకు నెలకు సరిపడా మందులను కేవలం 100 రూపాయలకే అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. వైద్య శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం ఎన్టీఆర్ ఫౌండేషన్ పాటుపడుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రావెళ్ల రంజిత్ ఎంబీబీఎస్ ఎండి జనరల్ మెడిసిన్ ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ అడపా జయశ్రీ నేత్ర వైద్య నిపుణులు ప్రజలకు వైద్య సేవలు అందించారన్నారు. వైద్య సేవలకు సహకారం అందించిన వాలంటీర్లకు. బీపీ చెక్ చేసి మాత్రలు వేసుకునే విధానంలో సేవలందించిన ఈగ అనిల్ కుమార్, గ్రామీణ వైద్యులు బండారుపల్లి నాగేశ్వరరావు, బండి పుష్పలత, షేక్ తానీష, ఎన్జీఆర్ ఫౌండేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి మాటూరి శేషగిరిరావు కీర్తిశేషులు సుగుణ దంపతుల కుమారుడు సుబ్రహ్మణ్యంగారు అల్పాహార వితరణ చేశారన్నారు. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ఆరోగ్య సేవలు పొందడానికి వచ్చినవారికి కోడూరు వెంకటాచారి మజ్జిగ పంపిణీ చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఆర్ ఫౌండేషన్ సెక్రటరీ కే వీ రెడ్డి కోశాధికారి గుడవర్తి నాగేశ్వరరావు ట్రస్ట్ సభ్యులు మందడపు శ్రీనివాసరావు కట్టెకోల వెంకటేశ్వర్లు కొంగర నారాయణ రావు పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్ వాలంటీర్ సేవలు అందించిన వల్లంచెట్ల భాస్కరరావు షేక్ అబ్దుల్ నబీ దండా సైదారావు, మంకెనపల్లి నరసింహారావు కొత్తా రాణి కోడూరి రామకృష్ణ కాలువ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# టీవీకే విజయంతో తమిళనాడులో కొత్త రాజకీయ అధ్యాయం

- ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన విజయ్‌కి కర్క నాగరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు

**బాలానగర్, మే 10 (క్రైమ్ మిర్రర్) :** తమిళనాడు రాజకీయాల్లో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేస్తూ సినీ హీరో, టీవీకే పార్టీ అధినేత విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం పట్ల గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, ప్రముఖ కార్మిక నాయకుడు కర్క నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన విజయ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కర్క నాగరాజు మాట్లాడుతూ "అత్యంత తక్కువ సమయంలో రాజకీయ పార్టీని స్థాపించి, ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించి, ఇటీవల జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి తమిళనాడు ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం సాధారణ విషయం కాదు, ఇది ప్రజా విశ్వాసానికి నిదర్శనం. ప్రజల ఆశయాలను గెలుపుగా మార్చుకున్న నాయకుడిగా విజయ్ నిలిచిపోయారని, తెలుగు రాష్ట్రాల మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తర్వాత పార్టీ స్థాపించి అతి తక్కువ కాలంలో ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన రెండవ వ్యక్తిగా విజయ్ చరిత్రలో నిలిచిపోయారని ఆయన అన్నారు. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టి ప్రజల మద్దతుతో అత్యున్నత స్థానాన్ని అందుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. ఎన్నికల ముందు



ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే నాయకత్వం విజయ్‌లో కనిపిస్తోందని, గెలుపు తర్వాత ఎదురైన అనేక రాజకీయ అవరోధాలు, ఒత్తిడులను ధైర్యంగా ఎదుర్కొని తన లక్ష్యాన్ని చేరుకోవడం ఆయన రాజకీయ సంకల్పబలానికి నిదర్శనమని కర్క నాగరాజు అభిప్రాయపడ్డారు. తమిళనాడు రాజకీయాల్లో విజయ్ ఒక సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. టీవీకే పార్టీకి మద్దతు తెలిపిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, విసికె తదితర పార్టీలకు కూడా ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో విపక్ష ఐక్యత కీలకపాత్ర పోషించిందని అన్నారు. గత మూడు రోజులుగా తమిళ రాజకీయాల్లో ఉత్కంఠభరితంగా సాగిన పరిణామాలు చివరకు ప్రజాస్వామ్య విజయంతో ముగియడం ఆనందదాయకమని పేర్కొన్న కర్క నాగరాజు, "కొన్ని శక్తులు రాజ్యాంగ విలువలను పక్కనబెట్టి హడావుడి సృష్టించినప్పటికీ చివరకు భారత రాజ్యాంగమే గెలిచిందని వ్యాఖ్యానించారు. చివరగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి రక్షణ కవచమని, రాజ్యాంగ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని కర్క నాగరాజు పేర్కొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలు సమాజ ఆరోగ్యానికి వరం

- సామాజిక బాధ్యతతో ప్రతి ధనవంతుడు సమాజ సేవలో భాగస్వామి కావాలి
- కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్

**కూకట్ పల్లి, మే 10 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలకు మరోసారి శ్రీకారం చుట్టిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సమాజంలో ఆర్థికంగా ఎదిగిన ప్రతి వ్యక్తి తన వంతు సామాజిక బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం కలిగి ఉండాలని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్ (హైటెక్ సిటీ) సౌజన్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మండల సాయిబాబ చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం వసంత్ నగర్ డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్లో ఘనంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ శిబిరాన్ని ప్రారంభించి ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం ఆయన స్వయంగా పలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 350 మందికి పైగా ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు, సలహాలు అందజేశారు. రక్తపోటు, షుగర్, గుండె సంబంధిత సమస్యలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను కూడా అందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ



ప్రస్తుతం మారుతున్న జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ముందస్తు జాగ్రత్తల ద్వారా అనేక వ్యాధులను తొలి దశలోనే గుర్తించి నివారించవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని అన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న యశోద హాస్పిటల్ యాజమాన్యాన్ని, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన మండల సాయిబాబ చౌదరిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాలి బాలాజీ, గంధం రాజు, కొప్పిశెట్టి దినేష్ కుమార్, సాయి తులసి, వాసు తదితరులు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు.

# కిస్మత్‌పూర్ నుంచి మోడీ సభకు తరలిన బీజేపీ నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ 122 డివిజన్ నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారీ బహిరంగ సభకు బీజేపీ నాయకులు భారీ ఎత్తున బయలుదేరి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర నాయకులు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్‌ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో నాలుగు బస్సుల్లో మహిళలతో పాటు భారీగా ర్యాలీతో బహిరంగ సభకు బయలుదేరారు. అంతకుముందు కిస్మత్‌పూర్ వీధుల్లో తిరుగుతూ బీజేపీ నినాదాలతో మారుమోగించి మోడీ సభకు బయలుదేరారు. దాదాపు 400పైబడి జనాలతో సభకు బయలుదేరారు. స్వచ్ఛందంగా సభకు జనాలు



రావడం ఆనందాకమని మునుముందు రాబోయే రోజుల్లో బీజేపీ పాలనను తెస్తామని అందరి సహాయ సహకారాలతో అభివృద్ధి లక్ష్యంగా నరేంద్రమోడీ చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల స్వచ్ఛందంగా గమనిస్తున్నారని రాబోయే కాలంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీరుడు పవన్‌సాయి, అన్నపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, ఎస్.సాయి, శేఖర్, లక్ష్మణ్‌ముదిరాజ్ తదితరులున్నారు.